# పెళ్ళి చేసేశాం!

"వెయ్యి అబద్ధాలాడి ఒక పెళ్ళి చెయ్యాలి!"

ఆ సామెత బహుశా ఆ ఊళ్ళో వాళ్ళే పుట్టించి ఉంటారు. అందుకే కల్యాణికి అంత పబ్లిగ్గా పెళ్ళి స్థిరపరచుకుంటోంటే .... పెళ్ళి చూపులు జరిగి పెళ్ళి వారు కార్లో వెళ్ళిపోతోంటే, వొక్కరూ నిజం బయట పెట్టలేదు. వాళ్ళందరివీ గొప్ప గొప్ప విశాల హృదయాలేమో! లేకపోతే ఏం జరుగుతుందో చూద్దామన్న కుతూహలమో!

మొత్తానికి ఊళ్ళో వాళ్ళ దయవల్లనే ఆ పెళ్ళి స్థిరపడింది. లగ్నం వేళవరకూ వొచ్చింది. పెళ్ళికొడుకు విడిదిలో స్నేహితుల మధ్య వున్నా, ఊహ లెక్కి, ఎక్కడెక్కడో షికార్లు చేస్తున్నాడు.

పెళ్ళికూతురు — కళ్యాణం బొట్టూ, నగలూ, పట్టుచీరా, అద్దంలో తెగచూసుకుని నవ్వుకుంటోంది.

"కొన్ని పెళ్ళిళ్ళు చెడగొట్టడం, కొన్ని సంసారాలు విడదియ్యడం మానవసేవే!" అంటే, చాలామంది "శివ! శివా!" అని చెవులు మూసుకుంటారు. అలాంటి శివ భక్తులకు ఒక దీన మానవుల కథ చెప్పాలని వుంది. కళ్యాణి పెళ్ళి చెడగొట్టడం మంచిదో, చెయ్యటం మంచిదో ఆ శివ భక్తులు ఆలోచించాలి. ఎవరికి మంచిదంటారేమో! కళ్యాణికే!

నిర్మొహమాటంగా చెప్పెయ్యాలంటే, కళ్యాణి పిచ్చి పిల్ల. రెండేళ్ళనించీ 'పిచ్చి'! ఇంట్లోవాళ్ళు తెలుసుకున్నది ఏడాదినించే. వైద్యం చేయిస్తోంది ఆర్నెల్లనించే. అస్తమానం చేతివేళ్ళు లెక్క పెట్టుకుంటుంది. చక్కగా వేసుకున్న జడ హఠాత్తుగా విప్పేసుకుంటుంది. అలా ప్రారంభమైంది జబ్బు.

అసలు పిల్ల చాలా ముద్దు మురిపాలతో పెరిగింది. అందరూ అన్నాలు తినే వేళకి తను లేచి బద్ధకంగా కాఫీ తాగుతుంది. అందరూ కాఫీ తాగేవేళకి తను రెండు మెతుకులు మొక్కుబడిగా కెలుకుతుంది. అలా జరిగింది పెంపకం. ఆ గారాబంతో ఈ కొత్త పిచ్చి కూడా పాతబాపతే అనుకున్నారు.

స్కూల్ ఫైనల్ పాసై కాలేజీలో చేరడానికి సిద్ధంగా వున్న కళ్యాణికి, ఎంతో డబ్బుగలవారి అమ్మాయికి, అసలు పిచ్చి ఎందుకొచ్చిందో డాక్టర్లు చెప్పాలి. వాళ్ళు కారణాలు చెప్పలేదుగానీ ఏదైనా ఊరుకి తీసుకుపోయి పిచ్చాసుపత్రిలో చేర్చి వైద్యం చేయించమన్నారు.

కళ్యాణి తల్లిదండ్రులు చాలా దీనంగా "రహస్యంగా మా మూలగదిలో వైద్యం చెయ్యకూడదా డాక్టరుగారూ?" అని అడిగారు, చాలామంది డాక్టర్లని. డాక్టర్లంతా వొక్క బళ్ళోనే చదివారో ఏమో — "అలా వీల్లేదు. మూల గది వైద్యం లాభంలేదు" అనేశారు నిర్మొహమాటంగా. పౌరుషవంతుడైన కళ్యాణి తండ్రికి చాలా కోపం వొచ్చింది డాక్టర్లమీద.

"నా వంశం ఎలాంటిదనుకుంటున్నారు ఈ డాక్టర్లు? నా పరువు ప్రతిష్టలన్నీ ఆసుపత్రిపాలు చేస్తానా?" అన్నాడు మండి పడుతూ.

పతివ్రత అయిన కళ్యాణి తల్లి — "నీ వంశం అంత గొప్పదయితే నీ కూతురికి పిచ్చి ఎలా వొచ్చింది? అసలు ముందు నీ వంశానికీ .... వైద్యం చెయ్యాలి" అనలేదు. పైగా, "అయ్యో! పిల్లకేదో కాస్త మతి భ్రమించిందని ఆసుపత్రుల్లో ఎల్లా పెడతామూ?" అని కంట నీరు పెట్టుకుంది.

"పిచ్చిదానా! నువ్వూరుకో. మన రహస్యం ఆసుపత్రి వరకూ పొక్కకుండా మన మూలగదిలో వైద్యం చెయ్యగలిగే వాణ్ణి తీసుకొస్తాను" అని శపథం చేశాడు పిచ్చితండ్రి.. అదే, పిచ్చిపిల్ల తండ్రి.

"అల్లా చెయ్యండి. అంతేగానీ ఆసుపత్రిల్లో పెడితే పిల్లకి పెళ్ళవుతుందా? మనం చెయ్యగలమా?" అందావిడ. పిల్లలు పెళ్ళిళ్ళు చేసుకోడానికీ, తల్లితండ్రులు పిల్లల పెళ్ళిళ్ళు చెయ్యడానికీ, జన్మలెత్తుతారని ఆవిడ గాఢ నమ్మకం.

ఒకరితో ఒకరు ఎప్పుడూ ఏకీభవించని ఆ దంపతులు, 'వంశం పరువు ఆస్పత్రి కెక్కించకూడదనే' విషయంలో వొక్కుమ్మడిగా ఏకీభవించి .... కూతురు జబ్బుకి మూలగదిలో రహస్యంగా వైద్యం చెయ్య గల నిపుణుల కోసం రహస్యంగా వాకబులు జరిపించారు.

ఓ భూతవైద్యుడు, ఓ రోజు ముహూర్తం పెట్టి మూలగది వైద్యం ప్రారంభించాడు. కిటికీలు మూసి గదినిండా పొగలు వేశాడు. ముగ్గులు వేశాడు. కళ్యాణి అందమైన, పొడవైన నల్లటి, మెత్తటి వెంట్రుకలన్నీ కత్తిరించి సీసాల్లో కెక్కించాడు, చాలా నేర్పుగా!

వెంట్రుకలు సీసాల్లో కెక్కించడంలో కళ్యాణి కూడా చాలా సాయం చేసింది. కళ్యాణి మొహం నిండా వైద్యుడు రకరకాల బొట్లు పెట్టాడు. నోట్లో బూడిద పోశాడు. "హ్రాం .... హ్రీం .... హ్రూం" అంటూ గావు కేకలు వేశాడు రహస్యంగా. చివరి ఘట్టంలో వేప మండలు పట్టుకుని కళ్యాణిని బాదటం మొదలెట్టాడు. కళ్యాణి మండిపడి తిరగబడింది. ఇద్దరు మనుషుల్ని పిలిచి దెయ్యాన్ని విరగదీసి పట్టుకోమన్నాడు. వైద్యుడు. గదిలో, రహస్య వైద్యంలో, కళ్యాణి వేస్తోన్న కేకలకీ ఏడుపులకీ తల్లి కొంచెం కంగారుపడి — "ఏవిటండీ, ఇది భూతవైద్యమా, రాక్షస వైద్యమా?" అంది.

"భూతాలూ, రాక్షసులూ ఒక్క వంశం వాళ్ళే! నువ్వూరుకో!" అన్నాడు, భర్తల వంశంలో పుట్టిన భర్త.

ఆ విధంగా చాలా రోజులు మూల గదిలో జరిగిన భూతవైద్యంతో ఏమీ లాభం లేకపోయింది. కళ్యాణి అందమైన తల కట్టంతా పల్చబడిందేగాని, దెయ్యాలు సీసాల్లోకెక్కలేదు.

ఒక రోజు హఠాత్తుగా కళ్యాణి గొప్ప బలంతో తిరగబడి భూతవైద్యుణ్ణి చావ బాదేసింది. వైద్యుడు ఠారెత్తి, పరిగెత్తి తప్పించుకుపోయాడు, తనే దెయ్యం లాగ!

కొన్నాళ్ళ విశ్రాంతి తర్వాత, మళ్ళీ ఆ మూలగదిలోనే, పంగనామాలవారి సన్ని కంటి వైద్యం ప్రారంభమైంది. ఆయన చూర్ణాలు నూరుతోంటే, ఆయన పిలక చేసే నృత్యాలకు కళ్యాణి చప్పట్లు కొడుతూ నవ్వేది. వైద్యుల వారికి కోపం వొచ్చి, పిలక గట్టిగా ముడేసుకునే వాడు. "పంతులు గారూ! పిలక విప్పండీ!" అని కళ్యాణి తెగ బతిమాలేది. పిలక విప్పక పోతే మాత్రలూ, కషాయాలూ మింగనని మొరాయించేది. పంతులుగారు మనశ్శాస్త్ర నిపుణులవారు కూడా కాబట్టి పిలక విప్పేవారు. కళ్యాణి గోలగా నవ్వి మాత్ర మింగేది. కషాయం తాగేది. నిమ్మకాయ తలంట్లతో. భగ్గునమండే కంటి కలికాలతో, ముక్కులోంచి నసాళాల కంటే పసర్లతో, నిర్దయగా వైద్యం జరిగింది మూలగదిలో! జబ్బు, తగ్గుతూ హెచ్చుతూ హెచ్చుతూ తగ్గుతూ, హెచ్చుతూ హెచ్చుతూ అట్లాడింది, వైద్యుల వారితో!

ఓ రోజు ఆయన చేతులు నలుపుకుంటూ, వొచ్చిన మట్టితో మాత్ర చుడుతూ — "అయ్యా! అమ్మాయిగార్ని మా వైద్యశాలలో .... క్షమించాలి తమరు .... అది ఆసుపత్రికాదు. మా వైద్యశాలలో, ఎంతో మంది మతిచాంచల్యం పొందిన రోగులు బాగుపడి ...." అని విన్నవించబోయారు.

"అది సరే పంతులూ! మా వంశం ఎలాంటిది?"

"అయ్యా! మహదొడ్డ వంశమండీ!"

"అవునా? మా పరువు ఎలాంటిది?"

"అయ్యయ్యా, చెప్పాలా? అది కూడా దొడ్డదే నండీ. కానీ అమ్మాయిగారి జబ్బు చూశారూ? .... అది వీటన్నిటికన్నా దొడ్డదండీ! అందుచేత .... మా వైద్యశాలలో...."

"అదుగో మళ్ళీ అదే కూతా?"

"అయ్యా! ఇక ఏ కూతా కుయ్యనండీ!" అని వైద్యులవారు సన్నికల్లు చంకన పెట్టుకుని, పిలక ఎగరేసుకుంటూ దయచేశారు. మూల గది వైద్య చరిత్ర అలా ముగిసింది.

కళ్యాణి జబ్బు శ్రుతిమించి రాగాన పడింది. ఎప్పుడూ నవ్వుతుంది కల్యాణి. ఆడపిల్ల ఎప్పుడూ ఆనందంగా నవ్వటం మంచిదే; ఆరోగ్యం కూడానూ. కానీ .... నవ్వి నవ్వి హఠాత్తుగా యాడవటం మంచిది కాదు గదా? అది అనారోగ్యం కూడానూ! తల చక్కగా దువ్వుకోడం మంచిదేగానీ, హఠాత్తుగా జుట్టు

పీక్కోడం మంచిది కాదు గదా? అందమైన జుట్టంతా పోతుంది కదా? అందరితోటీ దెబ్బలాడ్డం కూడా మంచిది కాదుగదా? "ఇదేం పిల్లమ్మా! పిచ్చి పిల్లలా వుంది" అను కుంటారు కదా? అల్లా అనుకుంటే వంశమేంగానూ, దాని పరువేంగానూ?

వంశం సంగతీ, పరువు సంగతీ తెలియని కళ్యాణి .... వొక్కోసారి వొంటి మీద గుడ్డలు వుంచుకోడం కూడా మానేస్తుంది. రాత్రిళ్ళు నిద్రపోదు. తెల్లవార్లూ వొక్కతీ నించుని వుంటుంది. "కాళ్ళు నొప్పెడ తాయమ్మా! కూచో తల్లీ!" అని ఎవరైనా కూచోబెడితే దిగ్గున లేచి నిలబడి "నీ కాళ్ళా, నా కాళ్ళా? .... నా కాళ్ళు నా ఇష్టం!" అని దెబ్బలాటకి దిగుతుంది.

"పిల్ల ఇలా అయిపోయిందేమా!" అన్న బెంగతో పూజ్య తల్లిదండ్రులు లెక్కలేనన్ని మొక్కులు మొక్కారు ముడుపులు కట్టారు — ముడుపుల మూటలతో పెట్టెలూ బుట్టలూ తట్టలూ నిండాయి.

ఒక రోజున కన్నతల్లి "పిల్లని ఆసుపత్రిలో పెట్టక తప్పదేమో!" అంది నిట్టూర్చి "పరువుపోక తప్పదేమో!" అన్నట్టు!

"ఎలా పెడతామే? పెళ్ళిమాటో? పిచ్చాసుపత్రి నుంచి వొచ్చిందంటే, ఎంత బాగుపడితే మాత్రం ఎవడు చేసుకుంటాడే?" అన్నాడు తండ్రి. అన్నాడేగానీ .... రహస్య స్నేహితులతోటి, రహస్య బంధువులతోటీ, రహస్య శ్రేయోభిలాషుల తోటీ, ఆలోచించాడు రహస్యంగా. చివరకి అందరూ కలిసి తేల్చారు — "ముందు పిల్లకి పెళ్ళి చేసెయ్యాల"ని!

ఆ తండ్రికి చెప్పలేనంత ఉత్సాహం వొచ్చింది. ఇనబ్బీరువాలో డబ్బు లెక్క చూశాడు. చాలా ధైర్యం వొచ్చింది. పొలాలూ .... తోటలూ .... చూశాడు. చాలా గర్వం వొచ్చింది. "హు! వారం రోజుల్లో పెళ్ళి చేస్తాను!" అన్నాడు భార్యతో.

ఆ భర్త ప్రగల్భాలూ .... శపథాలూ వినడమే ఆ భార్య ధర్మం! ఆవిడ చాలా ఆనందపడింది. "ఆఖరి పిల్ల పెళ్ళి వైభ వంగా చెయ్యాలి సుమండీ! మనం ఇక పెళ్ళిళ్ళు చెయ్యబోతామా, చెంద బోతామా?" అంది పెళ్ళి పనులకు లేస్తూ! ఇళ్ళ దులుపుళ్ళూ .... సున్నాలూ .... రంగులూ .... ముగ్గులూ .... పిండి వంటలూ .... అమ్మో! ఎంతపని! "పిల్లకి పచ్చల అడ్డిగ చేయించాలి సుమండీ! ఇప్పుడు పేష నొచ్చిందట. అందరూ పెట్టుకుంటున్నారు. రేపు పెళ్ళికొచ్చినవాళ్ళు నలుగురూ నన్నంటారు. యావనుకున్నారో!" అందా విడ. 'కన్నతల్లి వుండి కూతురికి పచ్చల అడ్డిగైనా చేయించింది కాదేమమ్మా?' అంటారేమోనని ఆ మాతృమూర్తి బెంగ!

"అల్లాగేలేవే! దేనికేంగావాలో అన్నీ నువ్వే పురమా యించు. పిల్లకి వొంటి నిండా నగల్లేవంటే నాకు మాత్రం చిన్నతనం కాదూ?" అన్నాడు తండ్రి.

"ఈయన ఎంత యోగ్యులమ్మా! ఇన్నాళ్ళు నేను గ్రహించ లేకపోయాను!" అనుకుందా ఇల్లాలు — కాపరాని కొచ్చిన పాతికేళ్ళకి! అవతల కూతురు వెర్రి కేక లేస్తోంటే, తల్లీ—తండ్రీ పెళ్ళి కబుర్ల పరవశత్వంలో మునిగి పోయారు.

★ ★ ★

కళ్యాణి తండ్రి, డబ్బుతో ఒక వల అల్లించాడు. అది అల్లటానికి ముప్పై వేలు పట్టింది. చూడ్డానికి చాలా షోగ్గావుంది. అది పట్టుకుని వేటకు బయల్దేరితే అందులో పడ్డాడు ప్రభాకరం. "అందులో పడ్డాడు" అనేకన్నా "కళ్యాణి ఫోటో చూసి .... ఆశలో పడ్డాడు" అనటం ఎక్కువ న్యాయంగా వుంటుంది. కానీ చేతిలో ఆ వల లేకుండా ఆ ఉత్త ఫోటోతో తిరిగితే ఎందులో పడేవాడో బాగా తెలిసేది.

ప్రభాకరం చదువుకున్నవాడు. అంద మైనవాడు, ఉద్యోగం దొరికినవాడు. ఈ మూడు విశేషాలూ చెప్పి నంతతేలిగ్గా .... అతను గడుసువాడో, గడుసువాడు కాని వాడో చెప్పడం కష్టం. అతని గడుస్తనాన్ని పరీ క్షించిన ఘట్టాలేవీ తారసపళ్ళేదు. కానీ మంచివాడు. నెమ్మదస్తుడు. కోపిష్టి కాడు. గొప్ప ఆదార్శాలూ అవీ కలవాడు కాడు. సినిమాలు చూచువాడు, పుస్తకాలు చదువు వాడు. హాయిగా .... సుఖంగా జీవించాలనే కోరికలు వున్నవాడు.

ఒకనాడా చిన్నవాడు .... ఇంకా చిన్న వాణ్ణి ....

వెంటబెట్టుకుని పెళ్ళిచూపుల కొచ్చాడు.

హఠాత్తుగా ఆ రోజునే కళ్యాణికి సుస్తీ చేసింద న్నారు. "ఎక్కువసేపు కూచోలేదు, పడుకోవాలి లోపల. డాక్టర్లు కేకలేస్తారు" అన్నారు.

ఐదు నిమిషాలకన్నా తక్కువసేపే చూశాడు ప్రభాకరం కళ్యాణిని. ఆ ఐదు నిమిషాలలో ఆ పిల్ల .... ఆ పిల్లాడికి ఎంత నచ్చిందో .... మనసంతా ఎంత ఆక్రమించిందో .... ఎంత అందమైన భవిష్యత్తు చూపించిందో .... మాటల్లోకీ, భాషల్లోకీ మార్చిచెప్పడం కష్టం! కష్టం కాదు. అసలు చెప్పడం అన్యాయం.

ఆ వెంట వచ్చిన చెలికాడు గోడల మీద ఫోటోలు చూసే వంకతో, మొహం .... పైకీ కిందికీ పక్కకీ మార్చుతూ, మైసూర్‌పాక్‌లూ .... జిలేబీలూ.... సున్నుం డలూ .... గారడీ వాడిలాగ మాయం చేసెయ్యడం నేర్చుకోడం మొదలు పెట్టాడు. ఆ అయిదు నిమి షాల్లో ఆ విద్య నేర్చేసుకుని మొత్తం ఆ పళ్ళేలు రెండూ తనొక్కడే మాయం చెయ్యగలిగాడు. ఇద్దరూ బయట పడి కారెక్కి .... చెరో లోకంలో విహరిస్తూ .... పలక రించుకోకుండా .... కళ్ళు మూసుకుని కూచున్నారు.

పెళ్ళి స్థిరపడిపోయింది! లగ్నాలు పెట్టేశారు!

★ ★ ★

పెళ్ళివారిల్లుకన్నా సందడిగా వుంది విడిది. ఆడవాళ్ళూ, పిల్లలూ రంగు రంగుల పువ్వుల్లా .... పిట్టల్లా .... తిరుగుతున్నారు. పిల్లలు .... గుండ్రాయి లంతంత మిఠాయి వుండలు పట్టుకుని కొరుక్కుని తింటూ ఆనందిస్తున్నారు. మొగాళ్ళు .... సరిగ్గా అర్థం కాని రాజకీయాలు మాట్లాడుకుంటూ, కుమ్ములాడు కుంటున్నారు. పెళ్ళికొడుకు, స్నేహితుల కోసం పేకా డుతూ, తనకోసం కలలు కనుకుంటూ గంటలు గడుపుతున్నాడు. ఆ కలల మూలాన్నేమో అతని మొహంలో పెళ్ళి కళ వుట్టిపడుతోంది. అతనే పెళ్ళి కొడుకని చెప్పకుండానే తెలిసిపోతోంది.

పెళ్ళి చూపుల తర్వాత కళ్యాణి ఫొటో అతని దగ్గరే వుంది. ఆ ఫొటో అతని గుండెల్లో ముద్రపడి వుంది. అతనా ఫొటో ఎన్నిసార్లు చూశాడో .... ఎంత ముద్దా డాడో .... ఆ ఫొటోలో కళ్యాణితో .... ఎన్ని మాట్లాడాడో అన్నీ కళ్యాణికి చెప్పే ఘడియలు నెమ్మది నెమ్మదిగా సమీపిస్తోంటే, ఇంకా పేకాడమని బలవంతపెట్టే స్నేహితులంతా శత్రువుల్లా కనపడ్డారు. చిరాకు పడ్డాడు. విసుక్కున్నాడు. అతన్ని రక్షించినట్టుగా తల్లి దగ్గర్నించి పిలుపొచ్చింది. గభీమని లేచి లోపలికి పారిపోయాడు.

ఆవిడ చాలా ఆందోళన పడుతోంది — "ఏవిట్రా ఇలా అంటారూ?" అంది కొడుకుని చూడగానే.

"ఏవిటి? ఎలా అంటారు?" అన్నాడు.

"అసలు పెళ్ళికూతురు .... పెళ్ళి చూపుల్నాడు నీతో ఏవన్నా మాట్లాడిందా?" అంది వ్యవహారానికొస్తూ తల్లి.

"ఏం? ఇప్పుడెందుకూ?"

"బాగానే మాట్లాడిందన్నావు కదూ?"

"అబ్బ! ఏవిటమ్మా? ఏవైంది?"

"అబ్బే! నేనూ నమ్మటంలేదుగానీ .... ఆ పిల్లకి పిచ్చంటారేవిటీ? రెండేళ్ళ నించీ వుందట! పిచ్చట!"

"ఛ! ఎవరు చెప్పారు?"

"ఎవరనకు, వాళ్ళ పేరు బైటబెడితే బాగుండదు. అసలు నిజమా కాదా అని బెంగగా వుంది."

ఆ 'ఎవరో'గానీ ఆ ఊరు కీర్తి కాపాడారు. ఆ ఊళ్ళో కూడా ఉదారహృదయులున్నారని రుజువు చేశారు. ఆ ఊరి కళంకం పోగొట్టారు.

ప్రభాకరం నమ్మలేదు — "వాళ్ళని నేనడగనా?" అన్నాడు.

"నువ్వడిగినా నేనడిగినా ఒకటే! అసలా పిల్ల ఎలా మాట్లాడిందంటే చెప్పవేం?"

"ఎక్కువేం మాట్లాడలేదుగానీ .... ఉండు, రాజుని పిలుస్తాను" అని పెళ్ళి చూపుల్నాడు .... తోడు వచ్చిన స్నేహితుణ్ణి పిల్చుకొచ్చాడు. అతగాడెంత జ్ఞాపకం తెచ్చుకోబోయినా .... ఆ జిలేబీల రుచీ .... సున్నుం డల పరిమళాలూ తప్ప .... రెండో విషయం గుర్తు రాలేదు! "అసలా పిల్లని నేను చూశానా?" అని ఎదురు ప్రశ్నవేశాడు.

ప్రభాకరానికి .... నెమ్మదిగా ఆందోళన ప్రారంభ

మైంది. "అమ్మ చెప్పే విషయం నిజం కాదుగదా?" అనుకున్నాడు.

"ఇప్పుడేం చేద్దామంటావు? నేనింకా మీ నాన్నతో అనలేదు" అంది వాళ్ళమ్మ కంగారుపడుతూ.

"ఇంకేం చెయ్యగలం? వాళ్ళనే అడుగు!" అన్నాడు.

"ఛ! 'మీ పిల్ల పిచ్చిదా' అంటే యావన్నా బాగుంటుందా? .... అయినా 'మా పిల్ల పిచ్చిదేనమ్మా!' అని వాళ్ళు నిజం చెప్తారా?"

"మరేంచేద్దాం? వీధిలో వాళ్ళనీ .... ఊళ్ళో వాళ్ళనీ వాకబు చేసే కన్నా .... అదే నయం. ఏదో చెయ్యమ్మా! అదేవిటో తేల్చుకో ముందు!" అని అక్కడ నిలబడ లేని వాడిలాగ .... దిగాలు పడ్డ మొహంతో .... నిరుత్సాహంగా తన గదిలోకి వెళ్ళి పోయాడు.

ఆ కొడుకు .... మొహంలో, కళ్ళల్లో, మాటల్లో విచారం చూస్తే .... తల్లి అనురాగమంతా ఒక్కసారి పొంగింది — "ఏవిటో వాళ్ళనే అడుగుతాను. మోమాటాలకి పోయి .... పిల్లాడి జీవితం నాశనం చేసుకుంటామా?" అనుకుని ఆవిడ కూడా అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

★ ★ ★

ముహూర్తం రెండే రెండు గంటలుంది. పెళ్ళి పందిరి విద్యుద్దీపాలతో పట్ట పగలుగా వెలిగిపోతోంది. చాలామంది జనం కుర్చీల మీద కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. హడావుడిగా తిరిగేవాళ్ళు తిరుగుతున్నారు. బ్యాండు వాళ్ళు చాలా అందంగా సినిమా పాటలు వాయిస్తున్నారు. పురోహితులు మండపంలో పీటలు వేయించి సరంజామా అంతా సర్దిస్తున్నారు. అంతా చురుగ్గా జరుగుతోంది. అయినా అందరూ నిరుత్సాహంగా వున్నారు. ఏదో వినటానికి సిద్ధంగా వున్నారు.

లోపల, అంతఃపురంలో, పెళ్ళి కూతురు పట్టు చీరతో వంటెడు నగలతో, మూలగదిలో బ్యాండు పాటలకు అనువుగా చక్కగా డ్యాన్స్ చేస్తోంది. ఎంతో అందంగా, లయబద్ధంగా, అడుగులేస్తోంది. బ్యాండు ఆగినప్పుడల్లా — "వాయించండ్రా! నా పెళ్ళి! వాయించండ్రా!" అని కేకలేస్తోంది.

ఆ పిల్ల మనసు ఏ రోజుల్లో చాలా శాంతంగా వుంటుందో ఆలోచించి మరీ లగ్నం పెట్టారు. అయినా ఇంట్లో హడావుడీ, బాజాలూ, పాటలూ అన్నీ విని పెళ్ళి కూతురు నవ్వుల్లోకీ, ఆటెనక డ్యాన్సుల్లోకీ దిగింది. మత్తు ఇంజెక్షన్ ఇప్పించి పడుకో బెడదామనుకున్నారు గానీ, లగ్నం వేళకి చాలా ఇబ్బంది అవుతుందని వూరుకున్నారు. ఐదు నిమిషాలకోసారి ఓ భీముడంత మనిషి కళ్యాణి దగ్గిరికి వెళ్ళి కేకలేసి, అల్లరి చెయ్యవద్దని మందలించి, కొడతానని బెదిరించి, ఎదురు తిరిగితే ఓ లెంప కాయ కొట్టి, అన్నమాట నిలబెట్టుకుని వెళ్తున్నాడు. కళ్యాణి కాస్సేపు ఏడ్చి, జుట్టు పీక్కుని, బ్యాండులో పాట రాగానే డ్యాన్సులోకి దిగుతోంది.

పెళ్ళి కొడుకూ, అతని తల్లీ అరగంట నించీ ఆ గది గుమ్మంలో నిశ్చేష్టులై నిలబడి వున్నారు! ఎవర్నీ అడక్కుండానే — ఎవరూ చెప్పకుండానే .... అంతా వాళ్ళకి అర్థమైంది.

కళ్యాణి తల్లి ఏకధారగా ఏడుస్తోంది. కళ్యాణి తండ్రీ, ఇద్దరు ముగ్గురు దగ్గిర బంధువులూ, కోర్టులో నిలబడ్డ ముద్దాయిల్లాగా ఆ గదిలో అక్కడక్కడా నిలబడి వున్నారు. కిక్కురుమనకుండా నిలబడ్డం కూడా తమ వంశ లక్షణం అని రుజువు చేస్తున్నారు. కళ్యాణి తండ్రిగారు ప్రస్తుతం మాట్టాడ్డంలేదుగానీ, మాట్లాడినప్పుడు తమ వంశ లక్షణాలన్నీ వారే చెప్తారు.

పెళ్ళికొడుకు తండ్రి వొక్కడే ఓ పరుపుల కుర్చీలో కూచుని పెళ్ళికూతుర్ని ఆశ్చర్యంగా చూస్తున్నాడు. పెళ్ళికొడుకు కోసం వేసిన ఇంకో పరుపుల కుర్చీ ఖాళీగా పడి వుంది. అదీ ఆ గదిలో వాతావరణం! చుట్టు పట్లకెవ్వరూ రాకుండా, ఆ గది ముందు జోడు మనుషులు కాపలా కాస్తున్నారు. ఆ వంశం పరువు ప్రతిష్టలు ఆ గది గడప అవతల్నించీ యథాతథంగా విరాజిల్లుతూ వుండాలని ..... ఆ వంశోద్ధారకుడి వాంఛితం!

కొంతసేపటికి .... కళ్యాణి .... అందర్నీ చూసి చిన్నబుచ్చుకుని మొహం చిట్లించుకుని, డాన్సు మానేసింది — 'వీళ్ళముందా డాన్స్ చేసేది' అన్నట్టు, దూరంగా పోయి గోడని కరిచి పెట్టుకుని నించుంది.

ప్రభాకరం మనసంతా ఏడుస్తోంది. కళ్ళనించి నీళ్ళధారలు స్రవిస్తున్నాయి. అంతమందిలో .... కళ్ళనీళ్ళు కారుస్తూనే కళ్యాణిని చూస్తున్నాడు. అతని సుందర స్వప్నాలు, అతని మధురలోకాలు, అతని రంగురంగుల పూలతోటలు, సుఖాల .... అందాల.... అనురాగాల .... పరిమళాల .... దాంపత్యం, .... అతని హృదయాంతరాలలో ముద్రపడివున్న ప్రియురాలు .... స్నేహితురాలు .... అర్ధాంగి .... అతని మనోలోకం .... సమస్తం అల్లకల్లోలమైంది! దుఃఖం తెరలు తెరలుగా పొంగింది. పట్టరాని కోపం వొచ్చింది.

"నన్నెందుకిలా ధ్వంసం చేశారు?" అని గర్జించాడు. కంఠం పెగల్లేదు. మాటలు ధ్వనించలేదు. మూగవాడయ్యాడు. బొట బొటా కన్నీళ్ళు కార్చాడు. కోపం తగ్గింది. వెర్రిగానూ, అమాయకంగానూ, భయంగానూ చూస్తోన్న కళ్యాణిని అక్కున చేర్చుకుందామనుకున్నాడు — "ఈమె నా భార్య, ఎప్పుడో నా భార్య అయిపోయింది. నేను విడిచి పెట్టను!" అనుకున్నాడు. తదేకంగా చూస్తూనే వున్నాడు తడి కళ్ళతో! ఆర్ద్రతతో! అనురాగంతో!

కళ్యాణి తల్లి ఏడుస్తూ, మాట్లాడుతూ, మాట్లాడి ఏడుస్తూ, ఏడ్చిమాట్లాడుతోంది. బంధువులు వొంత పాడుతున్నారు. అప్పటికి నూట పదహారు సార్లు చెప్పిన మాటలే ఆవిడ మళ్ళీ మళ్ళీ చెప్తూ ఏడుస్తోంది — "వొదిన గారూ! పెళ్ళయి కాపరం చేసుకుంటే దాని మనసు బాగుపడుతుందని ఎంతో మంది చెప్పారు. పెళ్ళిగాని పిల్లని పిచ్చాసుపత్రుల్లో పెడితే పెళ్ళెలా అవుతుంది చెప్పండి? దాని బతుకేం గానూ? .... మీకే ఓ ఆడపిల్ల వుంటే ...." అని ధర్మ పన్నాల జోలికి పోబోయింది.

"చాల్లేండి. ఎన్నిసార్లు చెప్పినా ఇదేగా చెప్తారూ? మీకే ఒక కొడుకువుంటే ఇలాంటి పిచ్చిపిల్లని మీరైతే చేసుకుంటారా? ఇలాంటి పిల్లని చేసుకుంటే నా కొడుకు బతుకేం గానూ? డబ్బుతో కాపరం చేస్తాడా? మీకు డబ్బుంటే వుండొచ్చును గానీ .... పిచ్చి పిల్లని అంటగట్టటానికి మీకెన్ని గుండెలూ? సమయానికి తెలిసింది గానీ లేకపోతే వాడి బతుకంతా ఏమయ్యేదీ?" అని తెగ ప్రశ్నలు వేసింది ప్రభాకరం తల్లి.

"వొదెనగారూ! మీరల్లా భయపడొద్దు! ఆ మూడు ముళ్ళూ పడనివ్వండి! పిల్లని ఎన్ని ఊళ్ళయినా తిప్పి .... ఎన్ని వేలైనా ఖర్చు పెట్టి .... బాగుచేయించుకుంటాము. మీకా పూచీ లేదు. తప్పకుండా బాగు చేయిస్తాము."

"మాకే పూచీలూ వొద్దుగానీ మా దార్ని మమ్మల్ని పోనివ్వండమ్మా! డబ్బు వుందని ఇంత విరగబాటు పనికి రాదు. పెళ్ళి చేసుకునే వాడు సుఖపడాలని చేసుకుంటాడా, ఆసుపత్రుల్లో పడి ఏడుద్దామని చేసుకుంటాడా?" అని మళ్ళీ రొండు ప్రశ్నలు వేసింది ప్రభాకరం తల్లి.

అప్పుడప్పుడూ ముందుకొచ్చి వొంత పాటపాడి వెనక్కి పోతోన్న ఓ పెళ్ళివారి బంధువు, మళ్ళీ ముందు కొచ్చాడు — "అమ్మా! మా వల్ల చాలా తప్పే జరిగింది. పెద్దవారు మీరు గ్రహించాలి. పిల్లదానికి పుటక నించీ స్థిమితం లేదనుకున్నారా? నిక్షేపంగా స్కూల్ ఫైనల్ పేసయ్యింది. దాని ఖర్మగాలి మధ్యలో వొచ్చిందీ తెగులు. మీరు కొంచెం శాంతపడండమ్మా! అసలు పిల్లది భర్తతో కాపరం చేసుకుంటే...."

"కాపరం ఎల్లాగయ్యా పిచ్చి మాలోకంతో?" అని మండిపడింది ప్రభాకరం తల్లి.

ఆ పెద్దమనిషి అతి వినయంతో కుంచుకుపోయి, ముడుచుకుపోయి, సగం వొంగి — "అల్లా అనెయ్యకండి. పిల్ల దానికి స్థిమితంలేని మాట నిజమే గానీ, కరుస్తుందా, రక్కుతుందా? అల్లాంటి జబ్బు కాదు సుమండీ!" అన్నాడు. కాపరం చెయ్యడానికి కరవక పోవడం, రక్కకపోవడం, చాలునని ఆ రసికాగ్రేసరుడి అనుభవసారం!

ప్రభాకరం తల్లి, పోట్లాటకి దిగుతూ — "సరేనయ్యా! రేపు పిల్లా పీచూ కలుగుతారు. ఎల్లా పెంచుతుంది తల్లి?" అని తిరుగులేని ప్రశ్న విసిరింది.

కళ్యాణి తల్లి కాస్సేపు యాడవడం మానుకుని, చేటంత మొహం చేసుకుంది "వొదినగారూ! దాని కడుపున ఓ కాయ కాయాలేగాని .... అది పెంచాలి టండీ? అన్నీ నేను చూస్తాను? ఇద్దరు దాదుల్ని పెడతాం."

"ఇద్దరు డాక్టర్లని పెడతాం!" — వొంత పాట!

"ఇద్దరు దాసీల్ని పెడతాం!" — కన్నతల్లి.

"ఇద్దరు ............................" — వొంతపాట!

"ముగ్గురు ........................" — కన్నతల్లి.

"ఏవిటి మీ అహంకారం?" అని రంకె వేశాడు ప్రభాకరం. అతని మనసంతా ఉడుకుతోంది. వొళ్ళంతా వొణుకుతోంది. మొహమంతా రౌద్రంతో, ఎదటివాళ్ళని ఎర్రగా కాల్చేసేలా చూశాడు. "ఎన్నికోట్ల డాక్టర్లు. ఎన్నికోట్ల దాదులు, ఎన్నికోట్ల దాసీలు కలిస్తే, ఒక 'తల్లి' అవుతుంది? ఆ పిల్లని అంత జబ్బుతో అలా వుంచి .... పెళ్ళి చేస్తారా, పెళ్ళి! ఆ వొచ్చినవాడు మర్నాడే వొదిలేసిపోతే ఏం చేస్తారు?" అని రంకెల వర్షం కురిపిస్తూ విరుచుకుపడ్డాడు.

"జవాబు చెప్పాలికావున్ను" అనుకుంది అత్త గారు. "ఏం చేస్తాం నాయనా? .... మా దగ్గరే వుంచు కుంటాం" అంది వినయంగా.

"ఆ వుంచుకోడం, ఇప్పుడే వుంచుకోండి!" అంటూ కుర్చీలోంచి లేచాడు ప్రభాకరం తండ్రి.

"ఇవి చేతులు కావు. తొందరపడకండి!" అంటూ కళ్యాణి తండ్రి తొందరపడుతూ ఆ లేచినాయన చేతులే పట్టుకున్నాడు. కాళ్ళు పట్టుకునే రివాజు కూడా వాళ్ళ వంశంలో వుందో లేదో ఆయనకి సరిగా తెలీదు. లేకపోతే అవి కూడా పట్టుకుని, ఆనవాయితీ నిలిపే వాడే.

"నన్నడిగి ఏం ప్రయోజనం? రేపు భార్యతో కష్ట సుఖాలను అనుభవించవలసిన వాడు వాడుకదా!" అంటూ ప్రభాకరం తండ్రి శాంతించి పరుపుల కుర్చీ గుర్తొచ్చి, వెనక్కి జరిగి పరుపుల్లో జారబడి మత్తుగా వెనక్కి వాలాడు.

"నాయనా, నువ్వేమంటావు?" అని పెళ్ళికొడుకు ఎదట దోషిలా నిలబడ్డాడు ఆ గొప్ప వంశస్థుడు.

పెళ్ళికొడుకు వినయంగానే మాట్లాడాడు. "చూడండీ! ఎలా సుఖపడాలో నాకు తెలియదుగానీ ఎలా కష్టపడకూడదో బాగా తెలుసు. ఈ పెళ్ళి చేసు కుని మేమిద్దరం సుఖపడేదేమీ వుండదు. ముందు మీ అమ్మాయికి మంచి డాక్టర్లతో వైద్యం చేయించండి. ఆమె జబ్బు తగ్గిపోతే, పెళ్ళి చేసుకోవచ్చునని డాక్టర్లు చెప్తే, నేనే చేసుకుంటాను. అంతవరకూ నేను పెళ్ళి చేసుకోను. మీకు మాట ఇస్తున్నాను" అన్నాడు ప్రభాకరం.

పెద్దవాళ్ళంతా తలోవిధంగా ఆశ్చర్యపడ్డారు.

"అదేవిట్రా నీ షరతులూ నువ్వూనూ! నీకు దేశంలో పిల్లలు దొరకరనుకుంటున్నావా? వాళ్ళు వైద్యం చేయించేవరకూ నువ్వు ఆగడం ఏమిటీ? వాళ్ళింత మోసానికి దిగితే నువ్విలా మాట్లాడతా వేమిటి? కుక్క కాటుకి చెప్పుదెబ్బలాగ మన దారిన మనం పోవాలిగానీ" అంటూ అతని తల్లి దుయ్య బట్టింది.

"ఏవిటీ? ఇప్పుడు పెళ్ళి ఆగిపోవాలా? ముందు వైద్యం చేయించాలా?" అని పెళ్ళి పెద్దలు ఆశ్చర్య పడుతున్నారు — "చూడు నాయనా! నువ్వన్నది మంచి మాటే. కానీ ఇన్ని ప్రయత్నాలు చేసి, ఇంత మంది బంధువుల్ని పిల్చి, తీరా లగ్నం ముందు పెళ్ళి ఆగిపోతే మా వంశానికెంత అప్రదిష్ట నాయనా!" అన్నాడా ప్రతిష్టల మానవుడు.

ప్రభాకరం — చాలా ఓర్పు తెచ్చుకుని "పిచ్చి పిల్లకోసం నేను మీతో ఇన్ని మాటలు మాట్లాడు తున్నాను. ఇప్పుడు చేసుకున్న ప్రయత్నాలు మళ్ళీ చేసుకోవచ్చు. ఇప్పుడున్న లగ్నాలు ఎప్పుడూ వుంటాయి. ఇప్పుడొచ్చిన బంధువులు మళ్ళీ వస్తారు. కానీ ఇప్పుడున్న ఆందోళనా విచారం అప్పుడుండవు. ఇప్పుడు లేని సంతోషం, ఉత్సాహం అప్పుడుంటాయి. అదే పెళ్ళిగానీ ఇది కాదు. ఈ పెళ్ళి చేసుకుని నన్నేం ఆనందించమంటారో చెప్పండి!" అన్నాడు దీనంగా.

అల్లుడు కొంచెం వేడి తగ్గి మాట్లాడుతోంటే ఇంకా చల్లబరుచుదామని "నీ ఆనందమే మా ఆనందం నాయనా! నీకు విచారం కలగనిస్తామా? నీకిచ్చేదానికి

రెట్టింపుతీసుకో! నీ ముద్దు ముచ్చట్లన్నీ తీర్చే పూచీ నాది. పెద్దవాణ్ణి, నా మాట కొట్టెయ్యకు. ఆ మూడు ముళ్ళూ పడనియ్యి" వాక్కో ముడికీ ఇంకో పదేసి వేలు తీసుకోమన్న లెక్కలో మాట్లాడా డాయన.

ప్రభాకరం అసహ్యంతో, కోపంతో అరవబోతోంటే, ఆస్థాన పురోహితుడొకాయన, కాపలా వాళ్ళని జయించుకుని రహస్య గది గుమ్మంలోకి జొరబడి పోయాడు. అక్కడ అంతా కుతూహలంగా పరికిస్తూ గృహస్తు నుద్దేశించి — "అయ్యా! శుభలగ్నం సమీ పిస్తోంది. వధూవరులు పీటల మీదకు రావాలి. అవతల..." అంటూ యాకరువు పెట్టబోయాడు.

గృహస్తు అడ్డుకుని — "వొచ్చేస్తున్నారు పంతులు గారూ! కొంచెం లాంఛనాల విషయం మాట్లాడు కుంటున్నాం. మీరు వెళ్ళి అన్నీ సిద్ధం చెయ్యండి. ఇదుగో! అల్లుడు చదువుకున్నవాడు. మీ పాతకాలం తతంగాలేవీ పెట్టకండి! మాంగల్యధారణ చాలు, ఐదు నిమిషాల్లో ముగించెయ్యాలి. యావనుకున్నారో! ..... అల్లుడికి యాభై వేలు కట్నం చదివించండి! గుర్తుంచు కోండి!" అని హడావిడిగా పురమాయించాడు.

ప్రభాకరం నిప్పులు కక్కుతూ — పురోహితుల వారి మీదకి పోయి, కాలు చితకదొక్కి "ఇదిగో పంతులూ! పెళ్ళి చెడి పోయిందని చెప్పెయ్! పెళ్ళికొడుకు వెళ్ళి పోతున్నాడని అందరికీ చెప్పెయ్! ఇంకా నించున్నావేం, ఫో అవతలకి!" అని ఉరిమి, పెద్ద పెద్ద అంగలేసుకుంటూ తనే వెళ్ళిపోయాడా గదిలోంచి.

తర్వాత అతని తల్లీ, పరుపుల కుర్చీలోంచి లేవ లేక బద్ధకంగా లేచి అతని తండ్రీ, నెమ్మదిగా నిష్క్ర మించారు.

"ఇలా మా వంశంలో ఎన్నడైనా జరిగిందా? ఆడపిల్ల పెళ్ళి హఠాత్తుగా ఆగిందా?" అని బంధువుల్ని వాకబు చేశాడు గృహస్థు. కొందరు "లే" దన్నారు. కొందరు "ఏమో!" అన్నారు. కొందరు 'ఇలా జరిగితే అసలీ వంశం ఇంకెవరిదోకాని మీది కాద'న్నారు.

చివరికి కొందరు పెద్దలు "వాడే వూడిపడ్డాడా, ఎవడికో వొకడికి చెయ్యక?" అని సలహాలిచ్చారు.

చాలా గొప్పగా నచ్చిందది గృహస్థుకి. హృద యానికి హత్తుకుపోయింది. వంశ గౌరవం కాపా డేందుకు పెద్దలే ఆ దారి చూపించారనుకున్నాడు.

లగ్నానికి ఇంకో అరగంట టైము వుంది. "ఈ అరగంట లోపల ఇంకో సంబంధం ఎందుకు దొరకదో నేనూ చూస్తాను. ఈ లగ్నానికే పిల్ల పెళ్ళి ఎందుకు జరగదో నేనూ చూస్తాను!" అని ప్రతిజ్ఞ చేశాడు పిచ్చి తండ్రి.

గృహిణి చాలా ఆనందించింది. "పెళ్ళి ఆగదు గదా? పచ్చల అడ్డిగ వృథా కాదు గదా?" అని నిబ్బర పడింది.

కళ్యాణిని చేసుకునేందుకు ఆ 'ఎవడో వొకడు' దొరికాడు పదినిమిషాల్లో, పెళ్ళి పందిట్లో బీడీ కాలుస్తూ! పేరు శ్రీరామచంద్ర మూర్తి. ఎక్కువ చదువు కోలేదు. బ్రహ్మ కూతురు ఆషామాషీగా, బద్ధకంగా 'నాన్న తిట్టడుగదా?' అన్న ధైర్యంతో ఆ కుర్రాడి బొమ్మని చేసి, కళ్ళూ ముక్కులూ, చెక్కిళ్ళూ సరిగ్గా దిద్దకుండా, మెరుగులు పెట్టకుండా ప్రాణం పోసే సింది. "ఫర్వాలేదులెమ్మా! మొగాడికి అందమేమిటి?" అని బ్రహ్మ శ్రీరామచంద్రమూర్తిని వాళ్ళమ్మ బొజ్జలోకి విసిరేశాడు. వాడు పెరిగి పెద్దవాడై, ఇంతవాడై, వాళ్ళమ్మతోపాటు ఈ పెళ్ళి కొచ్చాడు. సరదాగా బీడీ కాలుస్తూ నించున్నాడు.

"నీకు పెళ్ళి చేస్తాం" అని అతన్ని హఠాత్తుగా పట్టుకున్నారు.

ఆ యువకుడు జడుసుకుని వాళ్ళమ్మ దగ్గిరికి పరిగెత్తాడు. వాళ్ళమ్మ అప్పటికే వియ్యాలవారిచ్చే లాంఛనాల పట్టీ విని మూర్ఛబోయి తేరుకుంటోంది. ఆవిడ మొహం కళకళా వెలుగుతోంది. మొగుడితో కాపరం చేసిన్నాడేనాడూ ఆ మొహంలో అంత అందం కనపళ్ళేదు.

"అమ్మా! ఇదేవిటే" అన్నాడు కొడుకు బెంబేలు పడుతూ.

"అది అంతేరా నాయనా! అదృష్టం తన్నుకొచ్చే సింది. పెళ్ళికొడుకు వయ్యావు. ఇల్లా కలిసొస్తుందని కల్లో కూడా అనుకో లేదురా నాయనా! మీ నాన్న

లేరుగదా?" అని రివాజుగా ఏడ్చిందావిడ — ఆ నాన్న లేనందుకు రోజూ ఎంత ఆనందిస్తూ వుంటుందో ఆవిడికే తెలుసు!

"ఆ పిల్ల పిచ్చిదంటగా?" అన్నాడు కొడుకు కొంచెం గునుస్తూ.

"పిచ్చో, వెర్రో నీకెందుకురా? వాళ్ళే బాగు చేయించుకుంటారు .... రేడియో పెట్టీ, వాచీ గొలుసూ, వెండి పళ్ళేలు, చెంబులు, గిన్నెలు, అబ్బ ఎన్ని చెప్పను? అసలు అవన్నీ ఎక్కడ దాచుకోవాలో ఆలోచించు ముందు. నాగయ్యగారి ఇనప్పెట్లో పెడదామా? వీరన్న భోషాణంలో పెడ దామా? మీ అత్తారే ఓ ఇల్లు కట్టిస్తే మనకీ తిప్పలుండవు. యామంటావురా?"

అమ్మ చెప్తోంది బాగానే వుంది. అంత డబ్బు అన్ని వాస్తువులు .... ఎల్లా వొస్తాయి మరి?

"మరి సీత ఎలాగే?" అన్నాడు సిగ్గుపడుతూ. సీత అతని మేనమామ కూతురు — "బీడీలు మానెయ్యి, పెళ్ళి చేసుకుంటాను" అంటోంది రోజూ.

"పెళ్ళి చేసుకో, మానేస్తా!" అంటున్నాడు ఇతను.

"సీతెలాగేవిటి? దాన్నీ చేసుకుందువుగాని, ఈ పిచ్చిదేం వొద్దంటుందా, కాదంటుందా? అయినా అసలు దీన్ని మన కొంపకి పంపించర్రా? నాలుగు రోజులు పోనిచ్చి — పిచ్చిదాంతో కాపరం కుదరదని వొదిలేద్దువుగాని. ముందు మూడు ముళ్ళూ పడేసి .... ఆ డబ్బు సంచీ పట్టుకో. దాని ముళ్ళు మనం విప్పుదాం!"

"అందులో డబ్బంతా వుంటుందో లేదోనే అమ్మా?"

"అంత తెలివితక్కువ దాన్నిట్రా? నీకెందుకు, నువ్వూరుకో."

"మళ్ళీ నువ్వు తిట్టకు. ఆ డబ్బులో కొంచెం పెట్టి సీతకి నక్లీసు చేయిస్తాను."

"అలాగే, నీ ఇష్టం. 'అసలు కోడలు' అదే"

ఆ రకంగా శ్రీరామచంద్రమూర్తి, జ్ఞాన బోధా, కర్తవ్య బోధా పొందినవాడై మంగళ స్నానం చేసి పెళ్ళి పీట ఎక్కాడు.

కళ్యాణికి బాగా నిద్రొస్తోంది. పీట మీద కూచోనని మొరాయించింది మిఠాయి వుండ చేతిలో పెట్టి కూచో బెట్టారు. తన పీట పక్క పెళ్ళికొడుకు మారిన ఉదంతం కళ్యాణికి తెలియనే తెలియదు.

పురోహితుడు పవిత్రమైన మంత్రాలు చదివారు. బ్యాండులో అందమైన పాటలు వాయించారు. పెద్ద మనుషులు ఆశీస్సులతో అక్షింతలు విసిరారు. పిచ్చిది ఏం చేస్తుందోనని భయపడుతూ, ఇద్దరు మనుషులు పెళ్ళికూతుర్ని పట్టుకున్నాక, పెళ్ళి కొడుకు కళ్యాణి మెడలో మంగళ సూత్రాలు వేలాడదీసి చివర తాళ్ళ కొసలు కలిపి రెండుముళ్ళు వేసి వూడదని గ్రహించి గబగబా కూచున్నాడు. ఆ ముళ్ళు వేసినందుకు చాలా సంతోషించి అత్తమామలు పెద్ద మూట మోసుకొచ్చి అల్లుడి వొడిలో పెట్టబోతోంటే, వియ్యపురాలు దాన్ని వూడ లాక్కుని వీపు మీద మోసుకుపోతూ అంతర్ధాన మైంది.

"సీత మెళ్ళో రెండు ముళ్ళే కాదు, మూడు ముళ్ళూ వెయ్యాలి!" అనుకుంటున్నాడు పెళ్ళికొడుకు.

వైభవోపేతముగా, శాస్త్రబద్ధముగా, వేదయుక్త ముగా కళ్యాణి పెళ్ళి జరిగిపోయింది. జననీ జనకులకు కన్యాదాన ఫలం దక్కింది. వారి పూర్వీకుల వంశ ప్రతిష్ట నిలబడిపోయింది. బంధువులూ, చుట్టాలూ తెగ తిని, తెగ పొగిడారు. ఆ కీర్తనలన్నీ విన్నాక, పిల్ల తల్లి దండ్రుల కీర్తికాంక్ష తీరింది.

సరే, కళ్యాణి మాటేమిటి? ఈ పిచ్చి పిల్ల, వెర్రి శ్రీరామచంద్రుడి పాలబడీ, అతని తల్లి పాలబడీ, బత కాల్సిందేనా? ప్రభాకరం పెళ్ళి చెడగొట్టిన పుణ్యాత్ము లెవరోగానీ, వాళ్ళు ఈ పెళ్ళి కూడా చెడగొట్టలేక పోయారే!

అయ్యో! పిచ్చి కళ్యాణికి ఆస్పత్రుల్లో పెట్టి వైద్యం చేయిస్తారా? ఆ పిల్లకి నిజంగానే పిచ్చి తగ్గిపోతుందా? అలా జరగకుండా వుంటే ఎంత బాగుండును! బతికి నన్నాళ్ళూ తన పిచ్చిలోకంలో తను నిర్విచారంగా జీవిస్తే ఎంత బాగుండును!

['స్వాతి' మాసపత్రిక నించి 1965 ప్రాంతాల్లో కావచ్చు] ★